
ప్రజాప్రతినిధులకు పట్టని పీ4

బంగారు కుటుంబాల దత్తతకు ఒక్కరూ ముందుకు రాని వైనం



తిరుపతి ఆంధ్రజ్యోతి

పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే పీ4. పేదలకు సంపన్నుల చేయూత అందించడమే ఈ పథకం ఉద్దేశ్యం. పేదలు ఆత్మన్యూనతకు గురికాకూడదనే ఆలోచనతో వీరికి బంగారు కుటుంబాలు అనే పేరు పెట్టారు. చంద్రబాబు మదిలో మెదిలిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ సారథ్యంలో అధికార యంత్రాంగం సవాలుగా స్వీకరించింది. బంగారు కుటుంబాలకు చేదోడుగా నిలిచే మార్గదర్శుల కోసం గట్టి ప్రయత్నమే జరిగింది. ఇప్పటికే 3330 మంది ముందుకొచ్చారు. 19,546 కుటుంబాలను అండగా నిలబడతామని సిద్ధపడ్డారు. అధికారులు, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ఎందరో ముందుకొచ్చినా.. విచిత్రంగా ఒక్క ఎమ్మెల్యే కూడా మార్గదర్శిగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించలేదు.

జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలు:	83,000
అత్యధికం గూడూరు నియోజకవర్గంలో:	14,000
ముందుకొచ్చిన మార్గదర్శులు:	3330
దత్తత తీసుకోనున్న కుటుంబాలు:	19,546

ఎంపిక ఇలా..

ఇదివరకే ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతో పాటూ వివిధ సర్వేల ద్వారా జిల్లాలోని నిరుపేద కుటుంబాలను గుర్తించారు. ఈ జాబితాను వేర్వేరు బృందాలతో పరిశీలించి నిర్ధారించుకున్నారు. వీరి సామాజిక, ఆర్థిక స్థితిగతులు, కుటుంబ అవసరాలు, ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు వంటి వివరాలు నమోదు చేసుకున్నారు. దత్తత ద్వారా వీరికి అండగా నిలువగలిగితే ఈ కుటుంబాలు నిలదొక్కుకుంటాయని అంచనా వేశారు.

ఏ నియోజకవర్గంలో ఎందరు?

సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో 12 వేలకు పైగా బంగారు కుటుంబాలను గుర్తించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 11 వేలకు పైగా, వెంకటగిరి మూడు మండలాల పరిధిలో 7 వేలు, తిరుపతిలో 6 వేలు, నగరి రెండు మండలాల పరిధిలో 3 వేలు చొప్పున నిరుపేద కుటుంబాలను గుర్తించారు.

3330 మంది మార్గదర్శులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కావడంతో కలెక్టర్ సైతం దీని అమలును సవాల్‌గా తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ధనవంతులతో వర్గాల వారీగా, ప్రాంతాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 7వ తేదీకి 5 మంది మార్గదర్శులు మాత్రమే ముందుకొచ్చి 1911 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అంగీకరించగా కలెక్టర్ చొరవతో ఈ సంఖ్య 3330కి చేరుకుంది. వారు 19,546 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి అంగీకరించారు.

సీఎం పిలుపిచ్చినా స్పందించని ప్రజాప్రతినిధులు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తున్నారు. పేదరిక నిర్మూలనకు ఈ కార్యక్రమం ప్రపంచ వ్యాప్తంగా ఆదర్శం అవుతుందని బలంగా విశ్వసిస్తున్నారు. సీఎం పిలుపుతో ప్రవాసాంధ్రులు సైతం స్పందించి మార్గదర్శులుగా మారేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. అయితే జిల్లాలో ప్రజాప్రతినిధుల నుంచీ మాత్రం ఎలాంటి స్పందనా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇప్పటి వరకూ సీఎం చంద్రబాబు మూడు పర్యాయాలు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించారు. ఈనెల 19న స్వయంగా తిరుపతికి వచ్చి రెండు బంగారు కుటుంబాలకు చెందిన బాధితులను స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సదస్సులో మాట్లాడించి, వారిని దత్తత తీసుకున్న మార్గదర్శులను అభినందించారు. అయినా ప్రజాప్రతినిధులు ఎవరూ మార్గదర్శులుగా మారేందుకు, కనీసం ఒక నిరుపేద కుటుంబాన్ని అయినా దత్తత తీసుకునేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం.

ఐదు షికారీ కుటుంబాలను దత్తత తీసుకున్న కలెక్టర్

ఈ కార్యక్రమానికి సారథ్యం వహిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ ఐదు కుటుంబాల బాధ్యత తీసుకున్నారు. కలెక్టరేట్ పక్కనే ఉన్న షికారీ కాలనీ నుంచి ఈ కుటుంబాలను ఎంపిక చేసుకున్నారు. ఐదు కుటుంబాల్లో 18 మంది సభ్యులున్నారు. వారితో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పెళ్లయిన జంటలకు విడిగా ఇళ్లు, ఇళ్ల స్థలాలు కావాలని వారు అడిగారు. అలాగే పిల్లల చదువులకు సాయం చేయాలని, జీవనోపాధికి ఆర్థిక సాయం కావాలని కోరారు. ఇళ్ల స్థలాలను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించడానికి నిర్ణయించిన కలెక్టర్.. ఇళ్ల నిర్మాణం, పిల్లల చదువు, ఉపాధికి ఆర్థిక సాయం వంటి వాటికి దేశంలోనూ, విదేశాల్లోనూ వున్న తన స్నేహితులను సంప్రదించారు. వారు సాయం చేసేందుకు అంగీకరించారు.

వీఆర్వోను లైంగికంగా వేధించారని

వాకాడు తహసీల్దార్ సస్పెన్షన్

సోషల్ మీడియాలో తహసీల్దార్ నగ్న వీడియోలు

వేధింపులా, బ్లాక్‌మెయిలా?


రామయ్య (ఫైల్ ఫొటో)

నాయుడుపేట/వాకాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఓ మహిళా వీఆర్వోను వాకాడు తహసీల్దార్ లైంగికంగా వేధించారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలు జిల్లాలో సంచలనం సృష్టించాయి. వీడియోలో ఉన్న తహసీల్దార్ రామయ్యను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడంతో పాటూ సంఘటనపై విచారణకు ఆదేశించారు. అయితే ఈ సంఘటనపై భిన్న వాదనలు వినిపిస్తుండగా, ఇద్దరు విలేకర్ల పాత్రపై ఆరోపణలు వెలువడుతున్నాయి.

వీడియోల్లో ఏముంది?

వాకాడు తహసీల్దార్ రామయ్య నాయుడుపేటలోని పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు వీఆర్వో కళ్యాణి ఇంట్లో నగ్నంగా ఉండగా ఆయనపై వీఆర్వో తల్లి చీపురుతో దాడి చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆయన ప్యాంటు తొడుక్కుని బయటకు వెళ్లే ప్రయత్నాన్ని కొందరు అడ్డుకుంటున్నట్టు వీడియోల్లో ఉంది. జూన్ 24న ఈ సంఘటన జరగ్గా, 31న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

లైంగికంగా వేధించారు: వీఆర్వో

పెళ్లకూరు మండలం తహసీల్దారుగా రామయ్య పనిచేస్తున్నప్పటి నుంచి కూడా తనను లైంగికంగా వేధిస్తున్నారని వీఆర్వో కళ్యాణి ఆరోపిస్తున్నారు. తన తల్లికి ఈ విషయం చెప్పానన్నారు. 24వ తేదీన తన ఇంటికి వచ్చి లైంగిక దాడికి దిగారని చెప్పారు. దాంతో తనకు సన్నిహితులైన ఇద్దరు విలేకర్లకు ఫోన్ చేసి పిలిపించానని తెలిపారు.

విలేకర్ల పాత్రపై ఆరోపణలు

ఈ సంఘటనపై విలేకర్ల పాత్ర మీద కూడా విమర్శలు సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. 24న సంఘటన జరిగితే ఇన్ని రోజులు ఎందుకు వెలుగులోకి తీసుకురాలేదని ప్రశ్నిస్తున్నారు.డబ్బులు గుంజే ప్రయత్నం ఫలించకపోవడంతోనే వీడియోలు వైరల్ చేశారని ఆరోపిస్తున్నారు. ఇందువల్ల బాధితురాలైన వీఆర్వో ప్రతిష్ఠకు సైతం వారు తీవ్రంగా నష్టం కలిగించారని నెటిజన్లు మండిపడుతున్నారు. తనను కోటి రూపాయలు డిమాండ్ చేశారని తహసిల్దార్ రామయ్య ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక విలేకరి వారంలోగా రూ.35 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఆ తర్వాత నెల రోజులకు మరో రూ.35లక్షలు ఇవ్వాలన్నారని ఆయన పేర్కొన్నారు. లేకుంటే తన ప్రతిష్ఠ దెబ్బతినేలా వీడియోలు బయట పెడతామని బెదిరించారన్నారు. ఆ విలేకర్లే బలవంతంగా తన బట్టలు పీకేసి వీడియోలు తీశారని ఆయన పేర్కొన్నారు. భిన్న వాదనలు వినిపిస్తున్న ఈ సంఘటనపై లోతుగా దర్యాప్తు జరిపితేనే వాస్తవాలు వెలుగు చూస్తాయి.


ఇదంతా బ్లాక్ మెయిల్ కుట్ర: తహసీల్దారు

తనను కుట్రపూరితంగా ఇరికించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తహసిల్దార్ రామయ్య చెబుతున్నారు. వీఆర్వో కళ్యాణి పథకం ప్రకారం తనను ఇంటికి రప్పించి ఇద్దరు విలేకరులతో కలిసి తన నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయాలని పథకం వేశారన్నారు. ఇద్దరు విలేకర్లు కోటి రూపాయలు ఇవ్వాలంటూ తనను బెదిరించడంతో బుధవారం కలెక్టర్‌కు, గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశానని తహసీల్దారు రామయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు.

తహసీల్దారు సస్పెన్షన్

వీఆర్వో కళ్యాణి చేసిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం రాత్రి తహసీల్దారు రామయ్యను సస్పెండ్ చేశారు. విచారణకు సైతం ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రోజ్‌మాండ్‌ను విచారణాధికారిగా నియమించారు. కాగా గురువారం రాత్రి వాకాడు తహసీల్దారు రామయ్య చేసిన ఫిర్యాదుతో ఎస్పీ హర్షవర్ధన్ రాజు కూడా విచారణకు ఆదేశించారు. స్పెషల్ బ్రాంచి సీఐకి విచారణ బాధ్యతలు అప్పగించారు.

సారూ.. పింఛనిచ్చి ఆదుకోండి


మంచానికే పరిమితమైన వృద్ధురాలు రత్నమ్మ

● 70 ఏళ్ల వృద్ధురాలి వేడుకోలు ● గత ప్రభుత్వంలో తప్పిదంతో పాట్లు

మంచానికే పరిమితమైన ఈ వృద్ధురాలి పేరు రత్నమ్మ. వయసు దాదాపు 70 ఏళ్లు. ఊరు కేవీబీపురం మండలంలోని దేశూరివారి కండ్రిగ. 20 ఏళ్ల కిందటే భర్త చనిపోయాడు. తనకంటూ ఎవరూ లేరు. ఆ ఊర్లో ఒకరు ఏ పూటకాపూట తిండి తెచ్చి పెడుతున్నారు. అలాంటి ఆమెకు పింఛను లేదు. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే.. అప్పటి వరకు వస్తున్న పింఛను ఆగిపోయింది. ఏమంటే.. ఆమె పేరిట రెవెన్యూ రికార్డుల్లో ఐదు ఎకరాల భూమి ఉందట. అయ్యో సారూ.. ఆ భూమి ఎప్పుడో అమ్మేశాను. ఇప్పుడు నాకంటూ సెంటు పొలం లేదని ఆమె మొత్తుకున్నా రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఈమె వద్ద కొన్న వ్యక్తి రిజిస్టర్ చేసుకున్నా.. రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్చుకోలేదు. ఇలా ఒక తప్పిదం.. ఆ నిస్సహాయ స్థితిలోని అమ్మకు పింఛను లేకుండా చేసింది. ఎవరూ లేక.. ఆరోగ్యం బాగోలేక మంచానికే పరిమితమైన తనకు అధికారులు విచారించి.. వాస్తవం తెలుసుకుని పింఛను ఇప్పించాలని రత్నమ్మ కోరుతోంది. ఆ పింఛను డబ్బులొస్తే మందుల ఖర్చుకైనా ఉంటుందని ఆమె ఆశ.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

అన్నదాత సుఖీభవకు 1,54,807మంది రైతులు


సీఎం వర్చువల్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి 1,54,807 మంది రైతులు అర్హత కలిగి ఉన్నారని, ఇందులో 1,50,161మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని, 3,114మంది ఈకేవైసీ రిజక్టు కాగా 1,532మందివి పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ప్రకాశం జిల్లా దర్శిలో ప్రారంభించనున్న ఈ పథకంపై అమరావతి నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు రూ.20వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.


మినీ ఫాస్ట్ కంపోస్టర్‌తో విద్యార్థులు, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్

తడుకు నుంచి ఢిల్లీకి

● విద్యార్థుల ప్రాజెక్టు 'మినీ ఫాస్ట్ కంపోస్టర్'కు జాతీయ స్థాయిలో రెండో అవార్డు
● సోలార్‌తో పనిచేసేలా రూపకల్పన

8

కల్యాణి డ్యామ్ వైపు మళ్లీ ఏనుగులు

● రాగిమాకులకుంట సమీపాన వరి పంట ధ్వంసం

చంద్రగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని శేషాచల అటవీ ప్రాంత సరిహద్దుల్లో మూడు రోజులుగా గజరాజులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గురువారం తెల్లవారుజామున ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలోని రాగిమాకులకుంట సమీపంలో గోవర్ధన్ పొలంలో చొరబడి వరి పంటను ధ్వంసం చేశాయి. అనంతరం కల్యాణి డ్యామ్ వైపు వెళ్లాయి. దీంతో ఆప్రాంత ప్రజలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. రాగిమాకులకుంట, దుర్గం ఎస్టీ కాలనీల వైపు ఏనుగుల గుంపు రాకుండా అటవీ సిబ్బంది బాణసంచా కాల్చారు. డప్పులు వాయించారు. శ్రీనివాసమంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయి ఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీ కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. రాత్రి వేళల్లో రైతులు పొలాలకు వెళ్ళకూడదని సూచించారు. ఏనుగుల ఉనికి గురించి తెలిస్తే వెంటనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందించాలని కోరారు.


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు

పోలీసు స్టేషన్లకు అనుసంధానం

● వీడియో కాన్ఫరెన్సులో బ్యాంకర్లకు ఎస్పీ సూచన

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలోని అన్ని జాతీయ, ప్రైవేటు బ్యాంకుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు, అలారాలు ఏర్పాటు చేసుకోవాలి. బ్యాంకుల వద్దనున్న సీసీ కెమెరాలను పోలీసు స్టేషన్లకు అనుసంధానం చేయాలి. దీనివల్ల రాత్రి సమయాల్లో స్టేషన్ల నుంచి ప్రత్యేక నిఘా ఉంచడానికి అవకాశం ఉంటుంది' అని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తిరుపతిలోని ఎస్పీ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని బ్యాంకర్లు, డీఎస్పీలు, సీఐలతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. హిందూపురంలో బ్యాంకు దోపిడీ జరిగిన నేపథ్యంలో ముందస్తు చర్యలపై బ్యాంకర్లు, పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. బ్యాంకుల్లోని సీసీ కెమెరాల పనితీరు, రికార్డు అవుతున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల్లో ఎన్ని నెలల పాటు బ్యాకప్ వుంటుందని అడిగారు. క్వాలిటీ కలిగిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో సెక్యూరిటీ ఎంతమంది ఉంటారు? వారి విధులేంటనే వివరాలు తమకు ఇవ్వాలని బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కొన్ని ఏటీఎంల వద్ద నున్న సాంకేతిక సమస్యలను పరిశీలించి పునరుద్ధరించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం బ్యాంకు డ్యూటీకి వచ్చినప్పుడు చెక్ లిస్టు ఏర్పాటు చేసుకోవాలని.. క్లోజ్ చేసి వెళ్లేముందు అన్నీ జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు.


బ్యాంకర్లు, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తున్న ఎస్పీ


నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

తిరుపతి(కలెక్టరేట), జూలై31(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారిణి వసంతబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిశువుల ఆరోగ్యం, వారి అభివృద్ధికి తల్లిపాలే కీలకమని పేర్కొన్నారు. శిశువులకు అవసరమైన పోషకాలను తల్లిపాలు అందిస్తాయని తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఏసీబీ కేసులో సీఐ వెంకటప్పపై చర్యల నిలిపివేత

తిరుపతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తిరుపతి డీసీఆర్‌బీ సీఐ కుటాల వెంకటప్పపై ప్రభుత్వం తదుపరి చర్యలు నిలిపివేసింది. వివరాలిలా వున్నాయి. ఐదేళ్ల కిందట తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్ సీఐగా పనిచేస్తున్న ఆయనపై అవినీతికి పాల్పడడం ద్వారా ఆదాయానికి మించిన ఆస్తులు కలిగివున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో 2020 మార్చి 11న వెంకటప్పపై కేసు నమోదు చేసిన తిరుపతి ఏసీబీ అధికారులు అదే రోజున నెల్లూరు స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండు విధించడంతో ఆ రోజే సీఐ వెంకటప్పను అనంతపురం డీఐజీ సస్పెండ్ చేశారు. మరోవైపు వెంకటప్పకు చెందిన రూ.1.88 కోట్ల విలువైన స్థిరచరాస్తులను ఏసీబీ అధికారులు కోర్టుకు అటాచ్ చేశారు. రెండేళ్ల తర్వాత 2022 జూన్ 23న ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసింది. ఈ ఏడాది జూన్ 16న ఏసీబీ డైరెక్టర్ జనరల్ సమర్పించిన తుది నివేదికలో వెంకటప్పకు ఆదాయానికి మించి రూ.58.52 లక్షల విలువైన ఆస్తులు మాత్రమే కలిగివున్నట్టు నిర్ధారించారు. ఆదాయానికి మించి 15.45 శాతం మాత్రమే ఆస్తులు అధికంగా వున్నందున నిబంధనల రీత్యా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం లేదని, అందువల్ల తదుపరి చర్యలు నిలిపివేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీంతో సీఐ కుటాల వెంకటప్పపై తదుపరి చర్యలను నిలిపివేయడంతో పాటు ఆయన సస్పెన్షన్ కాలాన్ని డ్యూటీలో ఉన్నట్టుగా పరిగణిస్తున్నట్టు రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీఐ వెంకటప్ప ప్రస్తుతం తిరుపతి డీసీఆర్‌బీలో పనిచేస్తున్నారు.

7 నుంచి లక్ష బిల్వార్చన మహోత్సవం



తిరుచానూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): యోగిమల్లవరంలోని కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 9 వరకు లక్షబిల్వార్చన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు మూర్తి గురుకుల్ గురువారం తెలిపారు. తొలిరోజు ఉదయం అంకురార్పణ, వాస్తుశాంతి, కలశ స్థాపన జరుగుతుందన్నారు. మర్నాడు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు లక్ష బిల్వార్చన .జరుగుతుంది. భక్తులు రూ.300 చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వీరికి పసుపు కుంకుమ, జాకెట్‌వస్త్రం, గాజులు, కొబ్బరికాయ, పసుపుదారం, లడ్డుప్రసాదం అందిస్తారన్నారు. 9న మహాన్యాస రుద్రాభిషేకం, పూర్ణాహుతి కలశాభిషేకం జరుగుతాయన్నారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షించుకుందాం



భక్తులకు ఉపదేశమిస్తున్న కమలానంద సరస్వతి

భాకరాపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణలో హిందువులందరూ భాగస్వాములు కావాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద సరస్వతి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలోని కోదండ రామాలయం, ముత్యాలమ్మ ఆలయం, హరిజనవాడలోని దేవాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, కర్తవ్య దీక్ష, సమాజ శక్తి అనే నినాదంతో సనాతన హైందవ ధర్మ పరిరక్షణకు దేవాలయ సందర్శన యాత్ర చేపట్టామన్నారు. సంస్కృతాంధ్ర ప్రదర్శనకు హిందూ యువత ముందుకు రావాలన్నారు. దేవాలయాలను కాపాడుకోవాలన్నారు.

పేద కుటుంబాల ఉన్నతికే పీ-4 అమలు



సమీక్షిస్తున్న వెంకటేశ్వరరావు

భాకరాపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికి పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ సొసైటీ ఈడీ వెంకటేశ్వరరావు అన్నారు. చిన్నగొట్టిగల్లు సచివాలయంలో పీ-4 సర్వేపై సచివాలయ సిబ్బందితో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ఆర్థికంగా అట్టడుగున ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించాలన్నారు. నీడ్ అసెస్మెంట్ సర్వేలో ఆయా కుటుంబాలను ఏ అవసరాలు కావాలో గుర్తించాలన్నారు. ఈ కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి సహాయం చేయగల వారిని మార్గదర్శకులుగా గుర్తించాలన్నారు. మండలంలో 1284 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, కార్యదర్శి వెంకటేశులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

భాకరాపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): యువత ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథనాయక్ అన్నారు. చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందులు లేవని, దూరంగా ఉండడమే శ్రేయస్కరమన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీనియర్ అధ్యాపకులు నాగరాణి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహాభారత వేడుకలకు శ్రీకారం



ధ్వజస్తంభానికి పూజలు

రామచంద్రాపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ కమ్మపల్లె మహాభారత ఉత్సవాలకు శ్రీకారం చుడుతూ గురువారం వేకువజామున శాస్త్రోక్తంగా ధ్వజారోహణ నిర్వహించారు. తిరుమంజనం అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవమూర్తులను పుష్పపల్లకీలో ఊరేగించారు. ఈసందర్భంగా .మధ్యాహ్నం భగవతారిని జ్యోత్స్న వ్యాస జననం హరికథను వినిపించారు. రాత్రి వెంకటేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణజననం నాటికను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, గ్రామ పెద్ద లెక్కల మార్కొండయ్యనాయుడు, ప్రధాన అర్చకుడు హరిస్వామి పాల్గొన్నారు. నాదెండ్ల మోహన్‌నాయుడు, గుంటూరు శ్రీనివాసులు అన్నదానం చేశారు.

వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్‌కి అభినందన



ప్రొఫెసర్ రవికుమార్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతిరూరల్,జూలై31(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.రవికుమార్ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈనేపథ్యంలో వెటర్నరీ కళాశాల అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ రాంబాబునాయక్ నేతృత్వంలో పలువురు అధ్యాపకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ లక్ష్మీకవిత, డాక్టర్ నవీన్, డాక్టర్ కుమార్, డాక్టర్ సుష్మ, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుకుమార్ సేవలు స్ఫూర్తిదాయకం



సుకుమార్ దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు

చంద్రగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకుమార్ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు ఆకాంక్షించారు.ఆయనతోపాటు జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ నరసింహారెడ్డిలు గురువారం రిటైరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎస్వీయు రీజియన్ రీజనల్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ ప్రియా హాజరయ్యారు. స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డిప్యూటీ డైరెక్టర్లు నాగేశ్వరరావు, విజయభాస్కర్, బెహరా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ సేవలను కొనియాడారు. కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు మాట్లాడుతూ సుకుమార్ సారథ్యంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. వీరిద్దరినీ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలకు 20 కంప్యూటర్ల వితరణ



చంద్రగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు, బాలుర కళాశాలకు అమ్మాక్స్ సంస్థ చైర్మన్ డి.దశరథరెడ్డి తమ సంస్థ ద్వారా 20 కంప్యూటర్లను వితరణ చేశారు. గురువారం బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దశరథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్, అధ్యాపకులు వెంకటరమణ, వీసీ ప్రసాద్, శ్రీవాణి, రెడ్డివాణి, గౌస్ బాషా, సంధ్య, సుగుణ, తులసి, ఉషశ్రీ, లావణ్య, సుమిత్ర,పాల్గొన్నారు.

చంద్రగిరి

నానికి మోహన్‌బాబు పరామర్శ



పాకాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నానీని సినీనటుడు మోహన్‌బాబు గురువారం పరామర్శించారు. ఆదెనపల్లె పంచాయతీ పులివర్తివారిపల్లెలో ఆయన నాని మాతృమూర్తి లక్ష్మీభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

రేపు రూరల్ మండల సమావేశం

తిరుపతి రూరల్,జూలై31(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఉదయం 10.30గంటలకు సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కె.రామచంద్ర పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

సింగిల్‌విండో చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం



మధుశేఖర్‌ని అభినందిస్తున్న మధు, మునిశేఖర్

తిరుపతి రూరల్,జూలై31(ఆంధ్రజ్యోతి): మల్లంగుంట సింగిల్‌విండో చైర్మన్‌గా సి.మధుశేఖర్, డైరెక్టర్స్ మోహన్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా మధుశేఖర్ మాట్లాడుతూ.. పంటరుణాల మంజూరుకు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా అవకాశం కల్పించి ఎమ్మెల్యే పులివర్తినానీకి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి అమిలినేని మధు, జిల్లా ప్రధానకార్యదర్శి మునిశేఖర్, నేతలు గణపతినాయుడు, సాయిరాయల్, కిశోర్‌రెడ్డి, హరిరామ్, శ్రీను, సుధాకర్, సుబ్బురాయల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంబీయూ కాన్వొకేషన్

చంద్రగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏ.రంగంపేట సమీపంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయం రెండవ కాన్వొకేషన్, శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజి 14వ గ్రాడ్యుయేషన్ డేను శనివారం నిర్వహించనున్నారు. ఎంబీయూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి గురువారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంబీయూ ఇండోర్ స్టేడియంలో జరిగే కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఛాన్సలర్ హోదాలో డాక్టర్ మోహన్ బాబు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. విశిష్ట అతిథులుగా ప్రోఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామారావు, పాల్గొంటారన్నారు. ప్రత్యేక అతిథిగా జాతీయ విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొంటారన్నారు. సంగీత విద్వాంసుడు ఆనందన్ శివమణికి, మహారాష్ట్రకు చెందిన లోక్‌మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్డాకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులతో రఘునాథరెడ్డి, శివప్రసాద్‌వర్మ, రవికుమార్ చౌదరి తదితరులు

తిరుపతిరూరల్,జూలై31(ఆంధ్రజ్యోతి):కరకంబాడీరోడ్డులోని ఆర్‌సీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఎంబీఏ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే జరిగింది. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకుఎస్వీయూ ఎంబీఏ విభాగ హెడ్ ప్రొఫెసర్ పి.రఘునాథరెడ్డి, కరస్పాండెంట్ ఆర్.శివప్రసాద్‌వర్మ, డైరెక్టర్ వి.రవికుమార్‌చౌదరిలు మెడల్స్ ప్రదానం చేశారు. ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్, బహుమతులు, నగదు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ ఎన్‌జీపీ ప్రసాద్, ఎంబీఏ హెడ్ వైనిరీష, ఎంసీఏ హెడ్ లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మాధురి, మధు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

తిరుపతిరూరల్, జూలై31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వ్పుడుమాయమాటలు చెప్పడం..అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. తుమ్మలగుంటలో గురువారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. మేనిఫెస్టో క్యూఆర్‌కోడ్‌ని ఆవిష్కరించారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో ఒకరి గల్లంతు

నాయుడుపేట టౌన్, జూలై31, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపల్లి స్వర్ణముఖి నది వద్ద చేపలవేటకు వెళ్లిన వెంకటేశ్వర్లు (45) గల్లంతయ్యాడు. గురువారం చేపలు పట్టేందుకు వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో కలిసి స్వర్ణముఖి వద్దకు వెళ్లారు. వెంకటేశ్వర్లు నది లోతట్టు ప్రాంతానికి వెళ్లడంతో నీటి ప్రవాహ వేగానికి గల్లంతయ్యాడు. అతడితో పాటు వెళ్లిన వ్యక్తి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించాడు. నదిలో గాలించారు. రాత్రి అయ్యేవరకు గాలించినా ఫలితం లేకుండా పోయింది.

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

కోట, జూలై31, (ఆంధ్రజ్యోతి): కోట క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి కోటయ్య అనే వ్యక్తి నుంచి 20 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిన్నెలపూడికి చెందిన కోటయ్య క్రాస్ రోడ్డు నుంచి బెల్టు షాపునకు తరలిస్తుండగా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

రాయల జయంతి నిర్వహించండి



చంద్రగిరి కోట నుంచి పాదయాత్రగా బయలుదేరిన కమిటీ సభ్యులు

చంద్రగిరి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలను ప్రభుత్వం, టీటీడీ విస్మరించడం తగదని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ అన్నారు. రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాయల జయంతి సాధనకు గురువారం చంద్రగిరి కోట నుంచి అలిపిరికి పాదయాత్ర చేపట్టారు. ఈసందర్భంగా రెడ్డిశేఖర్ మాట్లాడుతూ శ్రీవారికి అపార భక్తుడైన రాయలు వెల కట్టలేని బంగారు, వజ్ర, వైఢ్యూరాలను సమర్పించారన్నారు. ఆ మహనీయుడి జయంతి, వర్థంతి, పట్టాభిషేకం ఉత్సవాలను నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. కనీసం చంద్రగిరిలో విగ్రహాన్ని కూడా ప్రతిష్టించలేదన్నారు. ప్రభుత్వం, టీటీడీ స్పందించి రాయలవారి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం అలిపిరి వరకు పాదయాత్రగా బయలుదేరారు. ఈశ్వర్‌గోపి , అమ్మ శ్రీనివాసులనాయుడు, మునిచంద్రరాయల్, మునిరత్నంరాయల్, ఎంవీబాబు, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబుతోనే ఏపీకి మహర్దశ

పుత్తూరు ఏఎంసీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు ఏఎంసీ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ఏపీకి మహర్దశ చేకూరుతుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం పుత్తూరు మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు రైతులకు సహకారం అందించాలని కోరారు. జిల్లా మార్కెటింగ్ ఏడీ సురేంద్ర ఆధ్వర్యంలో పుత్తూరు మార్కెట్ యార్డు పాలక వర్గం చైర్మన్‌గా డి.ఎస్.గణేష్, వైస్ చైర్మన్‌గా లీలావతి, డైరెక్టర్లుగా బాబునాయుడు, రమేష్, మహేష్, సుజాత, దామోదరం, గోపాల్, అమరనాథ్, ఉమాశంకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్ మాట్లాడుతూ పుత్తూరు మార్కెట్ కమిటీకి కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తి ఉన్నా వచ్చే ఆదాయం జీతభత్యాలకే సరిపోతుందని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని మార్కెట్ కమిటీ స్థలంలో రైతుబజార్లు, వారపు సంతలు, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేసి కమిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ గంజి మాధవయ్య, వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, నాయకులు జీవరత్నం నాయుడు, ధనపాల్, బాలాజీ, యుగంధర్, కరుణాకర్, ఆనంద్, ప్రతాప్‌రాజు, చెంచయ్య, జానా వెంకటయ్య, ఉమాపతి, హేమాద్రి, దశరథవాసు, కరుణాయాదవ్, మోహన్‌రాజు, తులసి, డీఎన్ ఏలుమలైలు పాల్గొన్నారు.

కాణిపాకంలో బ్రహ్మోత్సవ పనులకు శ్రీకారం



ఐరాల(కాణిపాకం), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఈనెల 27వ తేదీనుంచి ప్రారంభం కానున్న వార్షిక బ్రహోత్సవాలకు వరసిద్ధుడి ఆలయం ముస్తాబవుతోంది. గురువారం నుంచి ఆలయానికి రంగులు వేసే పనులు ప్రారంభమయ్యాయి. తొలుత ప్రధాన ఆలయ రాజగోపురానికి, సుపథ మండపానికి రంగులు వేస్తున్నారు. తర్వాత అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి, మణికంఠేశ్వరాలయాలతోపాటు గణేష్ సదన్,వినాయక సదన్‌కు రంగులు వేయనున్నారు. దీంతోపాటు ప్రధాన ఆలయం నుంచి అగరంపల్లె వరకు విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో తెలంగాణ యువకుడి మృతి



కొండల్ గౌడ్ మృతదేహం

శ్రీరంగరాజపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన కొండల్ గౌడ్(35) పాలసముద్రం మండలంలోని హట్సన్ డెయిరీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఎస్ఆర్‌పురం మండలం అంకనపల్లె పాల సెంటర్ తనిఖీ చేయడానికి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అంకనపల్లె సమీపంలో ఓ చింతచెట్టు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆపి, అదుపుతప్పి పక్కనున్న బావిలో పడిపోయాడు. బావిలో ఎవరో చనిపోయి ఉన్నారన్న స్థానికుల సమాచారంతో గురువారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సాయంతో మృతదేహాన్ని వెలుపలకు తీసి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు.

4 నుంచి నీలకంఠేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఈవో బాపిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 4న అంకురార్పణ, ధ్వజారోహణం, 5న రెండవ తిరునాళ్లు.. సూర్యప్రభ వాహనం, 6న మూడవ తిరునాళ్లు.. చంద్రప్రభ వాహనం, 7న నాలుగవ తిరునాళ్లు.. చిలుక వాహనం, 8న కేతిగం ఉత్సవం.. రాత్రి నంది సేవ ఉత్సవం, 9న రాత్రి రథోత్సవం, 10న ఉదయం కేడిగం, రాత్రి కల్యాణోత్సవం, గజ వాహనసేవ, 11న పార్వేట ఉత్సవం, గుంటకిందిపల్లి, జింగిలిపాళెం గ్రామాలకు చప్పరం ఉత్సవం, 12న ధ్వజావరోహణం, రాత్రి చప్పరం, 13న పల్లకీ సేవ, ఏకాంత సేవ జరుగుతుంది.

కర్మాగారంలో కార్మికుడి మృతి



మృతుడు శ్రీరామ్

నాయుడుపేట టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట -మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో కార్మికుడు శ్రీరామ్ (25) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సెజ్‌లోని కర్మాగారంలో ఎలక్ట్రీషన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్ గురువారం విధులు నిర్వహిస్తున్న సమయంలో అకస్మాత్తుగా సంపులో పడిపోయాడు. గుర్తించిన సహచర కార్మికులు బయటకు తీసి నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నంది వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి

నారాయణవనం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలో టీటీడీ అనుబంధంగా ఉన్న భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి నిత్య పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను నంది వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

10 నుంచి గంగ జాతర

రేణిగుంట జూలై 31(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ వంశపారంపర ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం గంగమ్మ ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన జాతరకు చాటింపు, 10న 108 కలశాలతో అమ్మవారికి పాలాభిషేకం, 11న పట్టణ పురవీధుల్లో గెరిగ ఊరేగింపు, 12న అమ్మవారికి విశేష అలంకరణలు, పొంగళ్లు, అంబలి సమర్పణ, 13న నడివీధి గంగమ్మ ప్రతిష్ఠ, విశ్వరూప దర్శనం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

గిరిజనులకు దారి సౌకర్యం కల్పించాలి: సీపీఐ

సత్యవేడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమర్తికండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు అడవిలోకి వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అటవీ సంపదపై ఆధారపడి జీవించే గిరిజనులపై ఇక్కడి క్వారీల యాజమాన్యాల దాష్టికాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని ఆరోపించారు. గిరిజనులను అడవుల్లోకి వెళ్లనీయకుండా దారికి అడ్డంగా గోతులు తవ్వి వారి జీవనోపాధిపై దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. గిరిజనులు కొండమీదకు వెళ్ళడానికి దారి సౌకర్యం కల్పించాలని, గతంలో గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలు, సాగు భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని సమగ్రంగా సర్వే నిర్వహించి ఆ భూములను వారికి అప్పగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గుడి పేరుతో ఆక్రమణ

- వైసీపీ హయాంలో ఆక్రమించుకుని ఫెన్సింగ్
- భూమి రైతులదేనని నిర్ధారించిన రెవెన్యూ శాఖ



ఎక్స్‌కవేటర్‌తో పొలాల్ని చదును చేస్తూ..

చిత్తూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి):గంగాధర నెల్లూరు మండలంలో గుడి పేరుతో రైతుల భూముల్ని ఆక్రమించుకోవడంపై వివాదం పెద్దదవుతోంది. ఎస్ఆర్‌పురంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నాం, పెద్దఎత్తున నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అప్పట్లో హడావిడి చేశారు. దీపక్‌కుమార్ అనే బెంగళూరువాసిని ఇక్కడికి తీసుకొచ్చి ఎస్ఆర్‌పురంలో ఓ భవనాన్నీ నిర్మించారు. ఆ దీపక్‌కుమారే జీడీనెల్లూరు మండలం అగరమంగళం వద్ద సుమారు 30 ఎకరాల్లో అంకాల పరమేశ్వరి గుడిని నిర్మించారు. ఆ ప్రాంగణంలోనే గెస్ట్‌హౌసుల్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. 24 ఎకరాల భూమిని రైతుల నుంచి కొని రిజిస్ట్రేషన్ చేసుకోగా.. అగరమంగళం, వీరకనెల్లూరు గ్రామాలకు చెందిన ఆరుగురు రైతులు తమ 6.5 ఎకరాల్ని అమ్మేందుకు ఒప్పుకోలేదు. దీంతో విజయానందరెడ్డి అండతో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 6.5 ఎకరాల్ని ఆక్రమించుకున్న దీపక్‌కుమార్ ఫెన్సింగ్ వేసుకున్నారు.

పభుత్వం మారాక మొదలైన రైతుల పోరాటం

కూటమి ప్రభుత్వం వచ్చాక అగరమంగళం, వీరకనెల్లూరు గ్రామాలకు చెందిన రైతులు శంకర్ బోయెడు, ఆనందబాబు, చిట్టెమ్మ, బీష్మయ్య బోయెడు, పార్వతి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు తమ భూములను తమకు ఇప్పించమంటూ ఫిర్యాదు చేశారు. ఆర్డీవో విచారణలో ఆ 6.5 ఎకరాల భూమి రైతులదేనని తేలింది. కలెక్టర్ ఆదేశాలతో నాలుగు నెలల కిందట జిల్లా సర్వేయర్ అక్కడికి వెళ్లి సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. రైతు పేరు, విస్తీర్ణంతో కూడిన సూచన బోర్డుల్ని ఏర్పాటుచేశారు. దీంతో రైతులు తమ భూముల్లో కొబ్బరి చెట్లను సాగు చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఈ భూమి మీది కాదని, ఫెన్సింగ్ తీసేయాలని జీడీనెల్లూరు తహసీల్దార్ ఏప్రిల్‌లో దీపక్‌కు నోటీసులిచ్చారు.అయితే ఆ నోటీసుల్ని సస్పెండ్ చేస్తూ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్న దీపక్ తన మనుషులతో 6.5 ఎకరాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. రైతులు సాగు చేసుకున్న కొబ్బరి చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తవ్వేశారు.

రైతులపై దాడి చేసిన ఆక్రమణదారులు

తమ భూమిని దక్కించుకునే క్రమంలో ఈనెల 21వ తేదీన బాధిత రైతులు కలెక్టరేట్‌కు వచ్చి మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో 24వ తేదీ రాత్రి దీపక్ మనుషులు రైతుల మీద దాడి చేసి గాయపరిచారు. వారంతా చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసి కలెక్టర్ సుమిత్ కుమార్.. ఎస్సీ రైతుల భూముల్ని ఆక్రమించుకున్న వారిపై, దాడి చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ 25వ తేదీన ఎస్పీ మణికంఠకు రైతుల ఫిర్యాదును పంపించారు.సోమవారం వరకు కూడా ఆక్రమణదారులపై, దాడి చేసిన నిందితులపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు.రైతుల భూముల్ని ఆక్రమించుకున్న దీపక్, అతని అనుచరుడి మీద 2024 మే నెలలో గుడి పూజారిని కిడ్నాప్ చేసిన కేసు జీడీనెల్లూరు పోలీస్‌స్టేషనులో నమోదైంది. 'గుడి నిర్మించి నన్నే కమిటీ మెంబర్‌గా పెట్టుకున్నానని చెప్పి తొలగించారని పూజారి.. అధికారులకు ఫిర్యాదులు చేసేవారు. పూజారిని కిడ్నాప్ చేసి తమిళనాడుకు తీసుకెళ్లారు. తప్పించుకుని తిరుపతిలో చికిత్స పొందిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దీపక్, అతని అనుచరుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు.

అది రైతుల భూమే

అగరమంగళం, వీరకనెల్లూరు గ్రామాలకు చెందిన ఆరుగురు రైతుల ఫిర్యాదు మేరకు వారి 6.5 ఎకరాల గురించి విచారించి, సర్వే చేశాం. అది ఆ రైతుల భూమేనని నిర్ధారించాం. అక్కడ గుడిని నిర్మించినవారు ఆక్రమించుకున్నారు. ఆక్రమణదారుల వద్ద ఎలాంటి రికార్డులు లేవు.

శ్రీనివాసులు, తహసీల్దార్

రాయల్ చేనేత హస్తకళ ప్రదర్శన ప్రారంభం



కలంకారీ వస్త్రాలను చూస్తున్న కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఖాదీకాలనీలోని శివశక్తి కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన రాయల్ చేనేత హస్తకళ ప్రదర్శనను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ గురువారం ప్రారంభించారు. స్టాల్స్‌ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. వివిధ ప్రాంతాల్లో తయారవుతున్న చేతివృత్తుల వస్తువులు, దుస్తులు, కొయ్య, మట్టిబొమ్మలు, తినుబండారాలను ఒకే వేదికపై ప్రదర్శించి విక్రయించడాన్ని అభినందనీయ మన్నారు. నిర్వాహకులు జగన్మోహన్, శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ప్రదర్శన వచ్చేనెల 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని,నగరప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేపల వాసన భరించలేకున్నాం



తహసీల్దార్ సురేష్‌బాబుకు సమస్యలు విన్నవిస్తున్న కాలనీవాసులు

తిరుపతి అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): దగ్గర్లోనే చేపల మార్కెట్ ఉండటం వల్ల దుర్వాసన భరించలేకున్నామని, దాన్ని మరోచోటకు తరలించే చర్యలు తీసుకోవాలని స్కావెంజర్స్ కాలనీ వాసులు అధికారులను కోరారు. గురువారం ఆ ప్రాంతంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాత్రిపూట మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిపారు. రేషన్ కార్డులు ఇప్పించాలని కోరారు. తాగునీరు సరఫరా కావడం లేదని, పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ రామచంద్ర, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, కార్పొరేటర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

15వ తేదీ వరకు రేషన్ ఇవ్వాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి (కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల్లో ప్రతినెలా 15వ తేదీ వరకు నిత్యావసర సరుకులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నేతలు సుబ్రహ్మణ్యం, హేమలత కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులుకు విన్నవించారు. వారు మాట్లాడుతూ రేషన్‌షాపుల్లో తూతూ మంత్రంగా నాలుగైదు రోజులు మాత్రమే సరుకులు ఇచ్చి దుకాణాలు మూసివేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 రోజులు ఇచ్చే చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్న క్యాంటీన్లలో పారిశుధ్యం లోపిస్తే చర్యలు



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై31(ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్లలో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. గురువారం ఉదయం నగరంలోని అన్న క్యాంటీన్లను, ఎమ్మార్‌పల్లెలోని యాచకుల సహాయక కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అన్న క్యాంటీన్లు శుభ్రంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో క్యాంటీన్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టోకెన్లు ఆన్‌లైన్ ద్వారానే పంపిణీ చేయాలని, నిర్ణీత సమయంలో ఆహార పదార్థాలు ప్రజలకు అందించాలని అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. యాచకుల పునరావాస కేంద్రంలో ఉన్న వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీఈలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని వివిధ స్టేషన్లలో పనిచేసి గురువారం ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ హర్షవర్ధనరాజు ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు. 41 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా మంచి సేవలు అందించారని, శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్ఐ ఎన్.నారాయణప్ప, ఏఎస్ఐలు మునిరత్నం, సురేష్‌బాబు, కానిస్టేబుల్ కృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, ఎస్బీ సీఐ సాధిక్ ఆలీ, రమణారెడ్డి, పోలీసు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్టాండ్‌కు స్థలం కేటాయించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూలై31(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రైవేట్ బస్టాండ్‌కు స్థలం కేటాయించాలని గురువారం తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రైవేటు బస్సులు పార్కింగ్ చేసుకోవడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నామని కన్వీనర్ బోడుగు మునిరాజా యాదవ్ ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌తో మాట్లాడి స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని మునిరాజా యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రూపేష్, శ్రీనివాసులు, కమల్, బాషా, మల్లికార్జున, మురళి పాల్గొన్నారు.



ఈ చెట్లు హౌస్‌ఫుల్

సాధారణంగా విరగ్గాసిన చెట్లను చూస్తుంటాం. తిరుపతి నగరశివారు ప్రాంతాలైన తిమ్మినాయుడు పాళెం- మంగళం-శెట్టిపల్లి రోడ్డు మారెమ్మగుడి, చెన్నాయిగుంట పొలాల్లోని కొబ్బరి, తాటి చెట్ల నిండా గిజిగాడి గూళ్లు ఆకట్టుకుంటున్నాయి. సమీపంలో వరి పొలాలు ఉండటంతో పక్షులు వరి ఆకులు, పుల్లలతో గూళ్లను చాలా అందంగా అల్లుకున్నాయి. వడ్లను ఆహారంగా తీసుకుని గూళ్లలో నివాసముంటున్నాయి.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

తిరుపతి(ఆటోనగర్), జూలై31(ఆంధ్రజ్యోతి): సామాన్య విద్యుత్ వినియోగదారులకు పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు కోరారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా యశోదా నగర్, సుందరయ్యనగర్‌లో గురువారం సంతకాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ సదరన్ డిస్కం పరిధిలో రెండుకోట్ల గృహ విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్‌మీటర్లు అమర్చడానికి ఒప్పందాలు కుదిరాయన్నారు.ఆమేరకు అధికారులు మీటర్లు అమర్చుతున్నారని,ఇదిచాలా ప్రమాదకరమని తెలిపారు. మీటర్లు మార్చుతామని విద్యుత్ శాఖ అధికారులు వస్తే వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.వెంకటరత్నం, శివ, ప్రమీల, లోకేష్, అరుణ, టి.సుబ్రమణ్యం, వేణు, సాయిలక్ష్మి, పి.హేమలత, జయంతి, బుజ్జి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఏడుగురు ఏఏఓలకు పదోన్నతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఏడుగురు అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఏఓ)లకు అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఏఆర్)లుగా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జితేంద్రనాయక్, మహమ్మద్‌షఫీ, కవిత, వెంకటరమణ, విజయకుమార్, సురేష్‌కుమార్, లోకనాథం ఉన్నారు. ఈ సందర్భంగా వారు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో డ్రైవరు కుటుంబానికి రూ.లక్ష

ఆర్థికసాయం అందజేసిన టీడీపీ నేత కోడూరు



తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం గురువారం రూ.లక్ష అందించారు. బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పేరూరు ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ కనికాచలం మృతి చెందిన విషయం తెలిసిందే. కార్యకర్తల ద్వారా ఈ విషయం తెలుసుకున్న సుదర్శన్ ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం స్పందించారు. వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడి త్వరగా పోస్టుమార్టం పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. బాధిత కుటుంబానికి యూనియన్ తరపున రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని, ప్రమాద కారకులను శిక్షించేలా చూడాలని పోలీసులను కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ఎస్సీ కార్పొరేషన్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్తంగా ప్రధానమంత్రి అనుసూచిత్ జాతీయ అభ్యుదయ యోజన పథకం ద్వారా షెడ్యూలు కులాల నిరుద్యోగ యువతకు వృత్తి, ఉపాధి కోర్సులలో ఉచిత శిక్షణ, ఉపాధి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన సదుపాయం ఉంటుందని, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7981155147ను సంప్రదించాలని కోరారు.

జాతీయ కుస్తీ పోటీల్లో విజయం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు విజయం సాధించారు. జూలై 26 నుంచి 29వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఈ పోటీలు నిర్వహించారు. కోచ్ సాయిసుమతి నేతృత్వంలో విద్యార్థినులు లక్ష్మిలావణ్య, దీపిక, రేఖ, దీక్ష, పూజ, పూజశ్రీ, వైష్ణవి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ప్రిన్సిపాల్ భువనేశ్వరిదేవి వారిని అభినందించారు.

కలగానే శుద్ధజలం

తాగునీటి కోసం అవస్థలు పడుతున్న చెన్నాయిగుంట గ్రామస్తులు



తాగునీరు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

తిరుపతి అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం మంగళం పరిధిలోని చెన్నాయిగుంట గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. రెండు దశాబ్దాలుగా శుద్ధజలం కోసం ఇక్కడి 70 కుటుంబాల వారు ఎదురుచూస్తున్నారు. పాతికేళ్ల క్రితం వరకు గ్రామానికి పక్కనే ఉన్న మంచినీళ్లగుంట ద్వారా తాగునీరు తెచ్చుకునేవారు. కాలక్రమేణా నగరం నుంచి వచ్చే మురుగునీరు చెరువుల్లోకి చేరడంతో కలుషితమయ్యాయి. దాంతో గ్రామస్తులు సొంతంగా బోర్లు వేసుకున్నారు. అందులోనూ ఉప్పునీరు వస్తుండడంతో తాగడానికి ఉపయోగపడలేదు. స్థోమత ఉన్నవారు వాటర్‌ఫిల్టర్లు పెట్టుకున్నారు. పేద, మధ్య తరగతి వారు రోజూ రూ.15వెచ్చించి 20 లీటర్ల శుద్ధజలాన్ని పొందుతున్నారు. ఇలా రోజుకు రెండు క్యాన్లు చొప్పున ప్రతి ఇంటా రూ.30ఖర్చు అవుతోంది. గతంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేకు పలుమార్లు సమస్య చెప్పినా పట్టించుకోలేదని, సమీప కాలనీల్లో నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, తమను చిన్నచూపు చూశారని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం మారినా అదే పరిస్థితి ఉందని తెలిపారు. అప్పుడప్పుడూ గ్రామంలోకి ట్యాంకర్లు వస్తున్నాయని, మిగిలిన సందర్భంగా రెండు కిలోమీటర్లు వెళ్లి క్యాను తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

రేపు వాహనం వేలం

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన కారును ఆగస్టు రెండో తేదీన వేలం వేయనున్నట్లు రూరల్ సీఐ నరసనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో రేణిగుంట వద్ద ఉన్న లిక్కర్ డిపోలో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వివరాల కోసం తిరుపతి రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి జూపార్కు రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతిచెందాడు. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు.. దాదాపు 55ఏళ్ల వ్యక్తి జూపార్కు రోడ్డులోని అటవీ శాఖ పరిధిలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. విషయం గమనించిన వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మద్యం మానడం లేదని ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం సర్కిల్ వద్ద గురువారం మహిళ ఆత్మహత్య చేసుకుంది. సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని సాయిబాబా గుడి వద్ద కాపురమున్న గజేంద్ర మద్యానికి బానిసయ్యాడు. మందు తాగొద్దని భార్య కన్నని(38) ఎంత చెప్పినా వినిపించుకోలేదు. గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద కూర్చుని మద్యం తాగుతుండటంతో వద్దు అని చెప్పినందుకు భార్యతో గొడవపడ్డాడు. మనస్తాపానికి గురైన కన్నని ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కన్నని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగు భాస్కరయ్యకు ఆత్మీయ సత్కారం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జూలై 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ, జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్యను పలువురు అధికారులు సత్కరించారు. గురువారం ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ భాస్కరయ్య వృత్తి జీవితంలో మంచిసేవ చేశారన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, జిల్లా సూక్ష్మనీటి పారుదల శాఖాధికారి సతీష్, అసిస్టెంట్ డైరెక్టర్ ధనంజయరెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిషనర్‌కు స్వాగతం



తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ అనిల్‌చంద్ర పునీత గురువారం తిరుపతికి వచ్చారు. పద్మావతి అతిథి గృహం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ స్వాగతం పలికారు.

రిటైర్డు ఉద్యోగులకు సన్మానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూడేళ్లుగా ఉద్యోగ విరమణ పొందిన 67 మంది ఉద్యోగులను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సన్మానించారు. సెనేట్ హాల్లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీకి వారు అందించిన సేవలను కొనియాడారు. జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మందుబాబులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మందుబాబులు, గంజాయి బ్యాచ్ రెచ్చిపోతోంది. గాలి వీధి, చింతకాయల వీధిలో గురువారం సాయంత్రం ఇద్దరు మందుబాబులు బాగా తాగిన మైకంలో రోడ్డుపై తూలుతూ నృత్యాలు చేస్తూ కనిపించారు. వారికి ఎదురు వెళ్లిన వారిపై తిరగబడి మాట్లాడడం.. బూతులు తిట్టడం కనిపించింది. మరోవైపు గాలివీధిలో కొందరు ఆడిందే ఆటగా...పాడిందే పాటగా వుంది. కాగా, వారం రోజుల క్రితం అరెస్టయి మళ్లీ బెయిల్‌పై బయటకు వచ్చిన రౌడీ ఒకరు గంజాయి చాక్లెట్లు తీసుకుని అక్కడే తిని మత్తులో ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులపై రౌడీయిజానికి దిగిన ఘటనలు లేకపోలేదు. ఇటీవల ఐఎస్ మహల్ వద్ద ఇద్దరు మందుబాబులు పార్కింగ్‌లో వుంచిన కారు పక్కకు తీయలేదనే అక్కసుతో డ్రైవర్‌పై దౌర్జన్యానికి దిగాడు. ఇప్పటికీ గాలివీధి, చింతకాయల వీధి అంటే రాత్రి 10 గంటల పైన రోడ్లపైన మహిళలు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందంటే.. అక్కడ గంజాయి, మందుబాబుల ఆగడాలు ఏ స్థాయిలో నడుస్తున్నాయో తెలుస్తుంది. బాలాజీ కాలనీలోని ఒక టీ దుకాణం వద్ద గురువారం సాయంత్రం నలుగురు మందుబాబులు తాగి గొడవకు దిగారు. అక్కడే వున్న పెద్ద మనుషులు కొందరు వారిని గట్టిగా మందలించి పంపారు.

విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన సేవలు

తిరుపతి(సెంట్రల్), జూలై31 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు మెరుగైన సేవలందించాలని ప్రిన్స్‌పల్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ సెంట్రల్ జోన్ అధికారి అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం తిరుపతి కార్యలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ● తిరుపతిలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యాలయ ప్రాంగణంలోని సీసీఏ కార్యాలయంలో జరుగుతుందని పేర్కొన్నారు.

రైలు ఢీకొనడంతో యువకుడి మృతి

తిరుపతి(నేరవిభాగం), జూలై 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి పడమర వైపు.. పద్మావతి పాలిటెక్నిక్‌కి ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభించింది. రైలు ఢీకొనడంతో మృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉండొచ్చని, కుడిచేతిపై కృష్ణమూర్తి అని పచ్చబొట్టు, రాగి కంకణం ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. గుండు కొట్టుకుని ఉన్న ఇతడు.. యాష్ కలర్ జీన్స్ ప్యాంటు, తెలుపు డిజైన్ కలిగిన ఫుల్ హ్యాండ్ చొక్కా వేసుకుని ఉన్నాడన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఫిర్యాదుపై తిరుపతి రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఎం.విఠల్ నాయక్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కాలేజీ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి సమాచారం కావాల్సిన వారు తిరుపతి రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.





తిరుమల.. పచ్చని సోయగాల మాల

ఇల వైకుంఠంగా భక్తులు భావించే తిరుమల గిరులు పచ్చదనంతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఇటీవల కురుస్తున్న అడపాదడపా వర్షాలకు చెట్లన్నీ చిగురించి ఈ ఆధ్యాత్మిక ప్రాంతానికి కొత్త వన్నెలద్దాయి. భక్తులను ఆహ్లాదంతో పులకరింపజేస్తున్నాయి. గుండెనిండా భక్తి నింపుకొని ఏడుకొండలను చేరుకుంటున్న వారు హరితకాంతలా మారిన తిరుమల కొండలను చూసి తన్మయత్వం చెందుతున్నారు. ప్రకృతి ప్రియులు ఈ నయనమనోహర అందాలను ఆస్వాదిస్తూ తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. శేషాచలంతో పాటు సమీపంలోని ఎస్వీ యూనివర్సిటీ లాంటి ప్రాంతాలు కూడా పచ్చదనాన్ని పరుచుకుని కనువిందు చేస్తున్నాయి.

మెరిసిన మన ఆణిముత్యాలు

● తడుకు విద్యార్థుల 'మినీ ఫాస్ట్ కంపోస్టర్' ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి

తిరుపతి(విద్య), జూలై 31(ఆంధ్రజ్యోతి): మన జిల్లా విద్యార్థులు ఢిల్లీలో మెరిశారు. మన విజ్ఞాన వీచికలు జాతీయ స్థాయి వేదికలపై జిల్లా పేరును మార్మోగించాయి. మన జిల్లా విద్యార్థులు రూపొందించిన నమూనా ఏకంగా పేటెంట్ హక్కు గడప తొక్కనుంది. వడమాలపేట మండలం తడుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ సైన్స్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకుని రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది.

జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గ నిర్దేశంలో తడుకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ సోలార్‌తో పనిచేసే 'మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను రూపొందించారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌కుగాను 2024 జూలైలో పోటీలు నిర్వహించగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 1,00,400 ప్రాజెక్టులు పోటీలో నిలిచాయి. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఈ ప్రాజెక్టుల స్క్రీనింగ్‌ని ఐదు దశల్లో వడపోయగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 100 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వాటిలో రాష్ట్రం నుంచి రెండు ఎంపికకాగా అందులో





సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ - ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థులు

తడుకు విద్యార్థుల ప్రాజెక్టు ఒకటి. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని గాల్గొటీ యూనివర్శిటీలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శన-వర్క్‌షాప్-2025 జరిగింది. ఈ ప్రదర్శనకు జిల్లా విద్యార్థుల సైన్స్ ప్రాజెక్ట్‌తోపాటు మొత్తం 39 ప్రాజెక్టులు పోటీపడ్డాయి. వీటిలో సోలార్ మినీ ఫాస్ట్ కంపోస్టర్ ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఏఐసీటీయూ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇళంగోవన్ కరియప్పన్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌ను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. మినీ ఫాస్ట్ కంపోస్టర్‌కు పేటెంట్ హక్కు పొందేందుకు ప్రతిపాదిస్తామని ప్రకటించారు. కాగా, మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.90,500 ప్రకటించింది.

పరికరం.. ఎంతో ఉపయుక్తం

మినీ ఫాస్ట్ కంపోస్టర్ పరికరం ద్వారా వంటగది వ్యర్థాలు, పండ్లు, కూరగాయల తొక్కలు, కుళ్లిన ఆహారం, కూరగాయల నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయొచ్చు. ఇది సంప్రదాయ పద్ధతిలో కాకుండా ఏరోబిక్ కంపోస్ట్ పద్ధతిలో బ్యాక్టీరియాను వృద్ధి చెందించి వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మారుస్తుంది. బాక్టీరియా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడానికి కావాల్సిన ఉష్ణోగ్రతను విద్యుత్‌తో పనిలేకుండా సోలార్ ప్యానెల్స్ ద్వారా సమకూరుతుంది. ఈ విధానంలో కీటకాలు అభివృద్ధి చెందకుండా కూడా ఈ విధానం పనిచేస్తుంది. ప్రస్తుతం గృహావసరాలకు సరిపడేలా రూపొందించిన ఈ పరికరాన్ని పెద్దఎత్తున వ్యాపార అవసరాలకు వినియోగించేలా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో అభివృద్ధి చేయనున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.99 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,303

తలనీలాలు సమర్పించినవారు: 27,166

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక ఆదాయం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌పీవోలు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల(ఎఫ్‌పీవో) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పనిచేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా చిరుధాన్యాల సాగుపైనా దృష్టి సారించాలన్నారు. ఉద్యాన పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. ఆయిల్‌పాం, ఆక్వా రంగంలోనూ మంచి రాబడులు వస్తున్నాయని వివరించారు. అగ్రిస్టాక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు ద్వారా తీసుకువచ్చే నూతన వ్యవసాయ మార్పులపై సుదీర్ఘంగా వివరించారు. రైతులకు ఉపయోగపడే సమాచారంతో వచ్చిన ఏపీఏఐఎంఎస్ సరికొత్త మొబైల్ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో పరిశోధనలపై దృష్టి సారించండి



ఐసర్‌లో జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు

● ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నూతన ఆలోచనలతో పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించి రసాయన పద్ధతులు సాంకేతికతల వంటి అంశాలపై చర్చించాలని ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య సూచించారు. ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న ఐసర్ ప్రాంగణంలో జూలై 29, 30వ తేదీల్లో జాతీయ సదస్సు జరిగిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండర్ రీసెర్చ్(ఐసర్) తిరుపతి రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సస్టైనబిలిటీ కోసం రసాయన శాస్త్రం అనే జాతీయ సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సదస్సులో సుస్థిర రసాయన పద్ధతులపై కొత్త పరిశోధనలు, ఆలోచనలు పంచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 18 ప్రత్యేక ఉపన్యాసాలు జరిగాయి. వీటిలో పదార్థ శాస్త్రం, ఎలక్ట్రో కెమెస్ట్రీ, పచ్చ రసాయన పద్ధతులు, శక్తి నిల్వ సాంకేతికతల వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో 300 మందికి పైగా పీజీ విద్యార్థులు, పరిశోధకులు, పోస్ట్ డాక్టరల్ ఫెలోస్ ఉత్సాహంగా పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్త కావాలి : కలెక్టర్

● పొదుపు సంఘాల్లో అవకతవకలు నివారించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో ఒక మహిళా పారిశ్రామికవేత్త ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మహిళా పొదుపు సంఘాల్లో అవకతవకలు జరగకుండా ఖాతా పుస్తకాలు ఎప్పటికప్పుడు రాయించాలని ఆదేశించారు. గురువారం తిరుపతిలోని ఓ హోటల్లో ఎంటర్‌ప్రెన్యూర్స్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి సంఘంలోని సభ్యులు జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, దాన్ని సాధించే దిశగా ముందుకెళ్లాలని సూచించారు. గ్రూపుగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ సీజ్


పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్లు

రేణిగుంట, జూలై 31(ఆంధ్రజ్యోతి):చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తుండగా పోలీసులు రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక టాక్టర్‌ను సీజ్ చేశారు. స్టేషన్ రైటర్ చలపతి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి మండలంలోని వేదాలచెరువు గ్రామంలోని చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులను చూసి కొంతమంది పారిపోయారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న రెండు ఎక్స్‌కవేటర్లు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 1,200 ఓటర్లు దాటిన తర్వాత అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీఆర్వో నరసింహులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల నేతలతో గురువారం పోలింగ్ కేంద్రాల సరళీకరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 33 అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. పేర్లు మార్పు కోసం 8 కేంద్రాలను గుర్తించామని తెలిపారు. 1,200 మంది ఓటర్లు దాటిన 162 కేంద్రాలను గుర్తించామన్నారు. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు.

రాష్ట్రంలో అలజడికి సృష్టించడానికి జగన్ వ్యూహం

● వైసీపీ యాప్ తెస్తే ఆవేదన చెప్పడానికి సిద్ధంగా మద్యం బాధితులున్నారన్న శాప్ ఛైర్మన్



తిరుపతి(జీవకోన), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడిప్పుడే రాష్ట్రం గాడిన పడుతుంటే.. అలజడి సృష్టించడానికి వైసీపీ అధినేత జగన్ వ్యూహం పన్నారని శాప్ ఛైర్మన్ రవి నాయుడు ఆరోపించారు. నెల్లూరు పర్యటనలోనూ కార్యకర్తలను రెచ్చగొట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ, అధికారులను భయపెట్టేందుకు యాప్ తెస్తానంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. యాప్ తెస్తే వైసీపీ ప్రభుత్వంలో మద్యం ద్వారా ఛిన్నాభిన్నమైన 30 వేల కుటుంబాలతో పాటు బాధితులెందరో తమ ఆవేదన చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ పాలనలో ప్రజాస్వామ్యం నాలుగు పాదాలపై నడిచిందని మంత్రి రోజా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే ఎగరేసి తంతామంటూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఎగెరెగిరి మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోమని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఎప్పుడైనా మహిళలా రోజా ప్రవర్తించారా అని ఆయన ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో చట్టం తన పని తాను చేసుకుపోతోందని, త్వరలోనే మరో కుంభకోణం కూడా బయటకు వస్తుందని చెప్పారు. ఓ మంత్రి రోజాను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారంటూ మీడియా వారు ప్రశ్నించగా అలాంటి వాటికి అవకాశం ఉండదని ఈ శాఖలో తాను ఉన్నానంటూ చెప్పుకొచ్చారు.

సెల్‌ఫోన్ దొంగిలించారంటూ దాడి

● అవమానం భరించలేక మహిళ ఆత్మహత్య ● ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


ప్రసన్న (ఫైల్ ఫొటో)

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లో సెల్‌ఫోన్ దొంగలించారంటూ పక్కింటి మహిళపై అనుమానం పెట్టుకున్నారు. తరచూ వేధించారు. నానా మాటలన్నారు. చివరకు దాడి చేశారు. ఆ అవమానం భరించలేక ప్రసన్న (30) ఆత్మహత్య చేసుకుంది. ఏర్పేడు మండలం మన్నసముద్రంలో 25 రోజుల కిందటి ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన ప్రకారం.. మన్నసముద్రంకు చెందిన గోడల కృష్ణయ్య, నారాయణమ్మ దంపతుల కుమార్తె ప్రసన్నకు, దొరవారి సత్రం మండలానికి చెందిన పోలయ్యకు వివాహమైంది. వీరికి ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ప్రసన్న తన పుట్టింటికి వచ్చారు. జూన్ 30న గంగమ్మ ఇంట్లో సెల్‌ఫోను కనిపించకుండా పోయింది. ఆమె ప్రసన్నపై అనుమానం పెట్టుకుని తిట్టేది. ఈ క్రమంలో జూలై 2న గంగమ్మ కుటుంబీకులు దాడి చేయగా, ప్రసన్న తీవ్రంగా గాయపడ్డారు. దాడి, దొంగతనం నెపం వేశారనే బాధ భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబీకులు తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జూలై 5న మృతి చెందారు. తమ కుమార్తెను అవమానించి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ కృష్ణయ్య జూలై 10వ తేదీన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారించిన పోలీసులు గంగమ్మతో పాటు ఆమె కుటుంబానికి చెందిన సుబ్రహ్మణ్యం, గురవయ్య, గంగమ్మ, శైలజ, పాపమ్మ, చిట్టెమ్మ, మణెమ్మపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే కేసు నమోదు

తమ కుమార్తె ప్రసన్న ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన 15 రోజుల వరకు పోలీసులు కేసు నమోదు చేయలేదని కృష్ణయ్య అంటున్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కలిశామన్నారు. ఆయన చొరవతోనే కేసు నమోదైందని అంటున్నారు. కాగా, తిరుపతి ఎంపీ గురుమూర్తి స్వగ్రామంలో.. తమ ఇంటి పక్కన ప్రసన్న ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాన్ని ఇప్పటి వరకు ఎంపీ పరామర్శించలేదని బంధువులు ఆరోపిస్తున్నారు.

12న బీజేపీ 'సారథ్యం'

● రాష్ట్ర పర్యటనలో భాగంగా జిల్లాకు రానున్న మాధవ్


రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'సారథ్యం' కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆగస్టు12న తిరుపతి నగరం, జిల్లాలో పర్యటిస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి నగరం రాఘవేంద్రనగర్‌లో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ఆధునీకరించి.. గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సామంచి మాట్లాడుతూ.. సారథ్యం కార్యక్రమం ఉదయం ఆర్ఎస్ఎస్ శాఖతో ప్రారంభమవై.. స్థానిక ప్రజలతో చాయ్‌పే చర్చ ఉంటుందని చెప్పారు. తర్వాత బీజేపీ నేతలు, కార్యకర్తలతో పాదయాత్రగా కచ్చపి ఆడిటోరియంకు చేరుకుంటారని, కార్యకర్తలతో విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. సాయంత్రం జిల్లాలోని ప్రముఖ పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో సమావేశమవుతారన్నారు. ఈ సందర్భంగా మాధవ్ పర్యటన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండ్రిగ ఉమ, చంద్రారెడ్డి, ఎస్ఎస్ఆర్ నాయుడు, కోటేశ్వరరావు, నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలాజీ, డాక్టర్ నరేష్‌బాబు, సత్యవేడు మునిక్రిష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అనూష రామకృష్ణ, నరేంద్రరెడ్డి, మల్లకుప్పం శేఖర్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు ట్రోఫీల బహూకరణ


ట్రోఫీలతో బ్యాడ్మింటన్ పోటీల విన్నర్స్, రన్నర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీల విజేతలకు గురువారం ట్రోఫీలు బహూకరించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసి, అభినందించారు. ఇక్కడ విజయం సాధించిన వారు డిసెంబర్‌లో విజయవాడలో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ టోర్నమెంట్‌ను చిత్తూరు బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

విజేతల వివరాలిలా...

● **మిక్స్‌డ్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.నవ్య(చిత్తూరు)లపై హేమచంద్రన్‌సెల్వం, కవిప్రియసెల్వం(విశాఖపట్నం) విజయం

● **ఉమెన్ డబుల్స్** : ఎ.హర్షిక, ఎ.ప్రవల్లికమణి(విశాఖపట్నం)లపై డి.దీపిక, డి.స్రవంతి(గుంటూరు) గెలుపు

● **మెన్ డబుల్స్** : వి.వి.హర్షవర్ధన్‌రాయుడు(ఈస్ట్ గోదావరి), కె.విష్ణుకేదార్(ప్రకాశం)లపై ఎ.భార్గవరామ్(గుంటూరు), జి.వి శ్వతేజ్(కడప) విజయం. ● **ఉమెన్ సింగిల్స్** : ఎం.తనిష్క(గుంటూరు)పై కె.నవ్య(చిత్తూరు) గెలుపు. ● **మెన్ సింగిల్స్** : టి.అనిష్‌డేనియల్(నెల్లూరు)పై కె.మోహిత్(తూర్పుగోదావరి) విజయం.

10మంది ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ. 6 లక్షల వంతున జరిమానా

తిరుపతి(నేరవిభాగం),జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో 10 మంది ముద్దాయిలకు ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. వివరాలిలా...2019లో పెరుమాళ్ల పల్లి బీటు పరిధిలోని ఎస్వీఎన్‌పీ డివిజన్‌లో తమిళనాడులోని తిరువన్నామలై, వేలూరు జిల్లాలకు చెందిన సి.విశ్వనాథ్, డి.సేతు, డి.రమేష్, ఎం.సంపత్, వి.రత్నం, బూచాయాన్, జె.కుమార్, సి.ప్రభు, సురేష్, సి.రామర్‌లు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆరేళ్ళ పాటు కేసు విచారణ దశలో ఉన్న ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 10 మంది స్మగ్లర్లకు ఐదేళ్ళ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో అధికారులు కఠిన శిక్షపడేలా సాక్ష్యాధారాలను నిరూపించడంలో సఫలీకృతులయ్యారు.

డ్రగ్స్ నివారణకు సహకరించండి

- ఈగల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ -

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నివారణకు అందరూ సహకరించాలని పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూ లా, ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ఈగల్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, కలిగి ఉన్నా, వాడినా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. దీనిపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్టు తెలిపారు. డ్రగ్స్ గురించి 1972 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఎవరైనా సమాచారం అందించవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఈగల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఎస్వీయూ పీఎస్ ఎస్ఐ కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసు ఈగల్ సెల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పాపానాయుడు పేటలో ఉన్న ధర్మరాజులస్వామి ఆలయంలో ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. అందుకు సంబంధించిన గోడపత్రికను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మరాజస్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నాయకులు కృష్ణప్ప మొదలియార్, అర్జున బాబు, జాఫర్, దొర, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు సిద్ధం చేశారు. శుక్రవారం ధ్వజారోహణంతో మొదలై 15న ధ్వజావరోణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

10 నుంచి రేణిగుంట గంగ జాతర

రేణిగుంట జూలై 31(ఆంధ్రజ్యోతి): రేణిగుంట గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ వంశపార్యపర ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం గంగమ్మ ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన జాతరకు చాటింపు, 10న 108 కలశాలతో అమ్మవారికి పాలాభిషేకం, 11న పట్టణ పురవీధుల్లో గెరిగ ఊరేగింపు, 12న అమ్మవారికి విశేష అలంకరణలు, పొంగళ్లు, అంబలి సమర్పణ, 13న నడివీధి గంగమ్మ ప్రతిష్ఠ, విశ్వరూప దర్శనం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, రావణ, లక్ష్మీరెడ్డి, సూరి, భాస్కర్, రేణుకుమార్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నంది వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి ఊరేగింపు



నారాయణవనం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలో టీటీడీ అనుబంధంగా ఉన్న భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి నిత్య పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను నంది వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

8న సామూహిక వరలక్ష్మీవ్రతం


ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆవరణంలోని బ్రహ్మగుడి వద్ద 8వ తేదీ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి ఈ వ్రతం జరుగుతుందని చెప్పారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం


ఆలయం వద్ద పూజలు చేస్తున్న దామోదర్‌రెడ్డి

ఏర్పేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులు నాయుడు అన్నారు. ఏర్పేడు మండలం చిందేపల్లిలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు పార్థసారథిరెడ్డి, పొన్నారావు, గురవారెడ్డి, నాగరాజు నాయుడు, నాగేశ్వరరావు, రాఘవేంద్రరావు, కుక్క రమణ, మునిరెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విజయ గణపతి కుంభాభిషేకం

శ్రీకాళహస్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం విశాలాక్షినగర్‌లో నూతనంగా నిర్మించిన విజయ గణపతి ఆలయంలో శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం జరుగుతోంది. అందులో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. సురేంద్రరెడ్డి, నవీన్, ఆంటోని, పురుషోత్తం, మౌలా, పుట్టారెడ్డి, విజయ్, మనోహర్ పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు బస్సు వసతి కల్పించండి


డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత బాలుర వసతి గృహ(ఎస్సీ) విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆలయ అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ డిప్యూటీఈవో కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి మునిచందు మాట్లాడుతూ వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించినప్పటికీ వారు చదువుకునే పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే స్కిట్ నర్సింగ్ కళాశాల వ్యానును విద్యార్థులను వసతి గృహం నుంచి పాఠశాలలకు, సాయంత్రం అక్కడి నుంచి వసతి గృహానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. శివ, అభి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ నిర్వహణతో పారదర్శకత

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆడిట్ నిర్వహణతో పారదర్శకత ఉంటుందని వెలుగు ఏపీఎం మునెయ్య తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ఎంపిక చేయబడిన ఆర్‌వీఎస్ మరియు కో సంస్థ ద్వారా గురువారం ఆడిట్ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రూ.1.13కోట్ల డిమాండ్‌కు నూరు శాతం రికవరీ వచ్చింది. ఆడిటర్‌లు కార్తికేయ, నారాయణ క్షుణ్ణంగా పరిశీలించారు.

4 నుంచి నీలకంఠేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఈవో బాపిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 4న అంకురార్పణ, ధ్వజారోహణం, 5న రెండవ తిరునాళ్లు.. సూర్యప్రభ వాహనం, 6న మూడవ తిరునాళ్లు.. చంద్రప్రభ వాహనం, 7న నాలుగవ తిరునాళ్లు.. చిలుక వాహనం, 8న కేతిగం ఉత్సవం.. రాత్రి నంది సేవ ఉత్సవం, 9న రాత్రి రథోత్సవం, 10న ఉదయం కేడిగం, రాత్రి కల్యాణోత్సవం, గజ వాహనసేవ, 11న పార్వేట ఉత్సవం, గుంట కిందిపల్లి, జింగిలిపాళెం గ్రామాలకు చప్పరం ఉత్సవం, 12న ధ్వజావరోహణం, రాత్రి చప్పరం, 13న పల్లకీసేవ, ఏకాంత సేవ జరుగుతుందని తెలిపారు.

కార్పొరేట్ సేవతో బంగారు కుటుంబాలను నెలకొల్పుదాం

● ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థల సామాజిక సేవలతో నిరుపేదలను బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో గురువారం పీ-4 కార్యక్రమంలో భాగంగా అధికారులు, పారిశ్రామికవేత్తలతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాల గణాంకాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని పరిశ్రమల నిర్వాహకులకు ఎమ్మెల్యే వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో మొత్తం 11,866మంది పేదలను గుర్తించామన్నారు. ఇప్పటికే 2,367 కుటుంబాలను 38 మంది పారిశ్రామిక నిర్వాహకులు దత్తత తీసుకుని వారికి మార్గదర్శకులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మిగిలిన పేదలను కూడా దత్తత తీసుకుని వారి జీవితాల్లో మార్పులు తెచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సక్రమంగా హాజరు కాని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు సక్రమంగా హాజరు కాని విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంలు తెలిపారు. మండలంలోని గాజులపెళ్లూరు పంచాయతీలోని ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవోలు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరును పరిశీలించారు. కొంత మంది విద్యార్థులు చాలా రోజుల నుంచి పాఠశాలకు రాకపోవడంతో ఉపాధ్యాయులను వెంట పెట్టుకుని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలకు ప్రతి రోజు పంపే బాధ్యత తల్లిదండ్రులదేనని సూచించారు. ప్రతి రోజు పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తీసుకురావాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

రీసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి

కేవీబీపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న రీసర్వేను నిబంధనలకు అనుగుణంగా త్వరగా పూర్తిచేయాలని భూములు, రీసర్వే విభాగాల అసిస్టెంట్ డైరెక్టర్ అరుణకుమార్ చెప్పారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. మండలంలోని సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రీసర్వేపై ఉన్న అపోహలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా సర్వే చేయవద్దని హెచ్చరించారు. మండలంలో ఎక్కువగా అటవీభూములు ఉన్నాయని, వాటిని జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం అయిన తరువాత మాత్రమే రీసర్వే చేయాలని ఆదేశించారు. ఆగస్టు 15లోపు రీసర్వేను పూర్తి చేసి నివేదికలను కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చంద్రయ్య, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

'భానోదయ' సేవలు ప్రశంసనీయం


హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, పద్మావతి తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): భానోదయ కలంకారీ సంస్థ సేవలు ప్రశంసనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. భానోదయ కలంకారీ సంస్థ నిర్వాహకురాలు పద్మావతి ఆధ్వర్యంలో గురువారం జరిగిన 15వ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి అంటే శ్రీకాళహస్తీశ్వరస్వామి, కలంకారీ అన్నారు. కలంకారీ కళ అభివృద్ధికి కృషి చేస్తున్న పద్మావతిని అభినందించారు. అంతకుముందు పసుపులేటి హరిప్రసాద్ ముక్కంటీశుడిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోపాలన్న ఆశయ సాధనే ధ్యేయం

శ్రీకాళహస్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి దివంగత మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆశయ సాధనే ధ్యేయమని ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని నాలుగుమాడ వీధుల్లో ఆయన పర్యటించారు. నాలుగు మాడ వీధుల్లో ప్రతి ఒక్కరినీ కలిసి కరపత్రాలను అందజేసి, సంక్షేమపథకాలపై ఆరా తీశారు. సమస్యలు అడిగితెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్, నాయకులు చెంచయ్య నాయుడు, కాసరం రమేష్, గుర్రప్పశెట్టి, సుబ్బయ్య, మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, గోపి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినికి అభినందనలు


సంజనను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్న సంజన అనే విద్యార్థిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. జూలై 25 నుంచి 28వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రం చండీఘర్ ప్రాంతంలో జరిగిన నేషనల్ అసోసియేషన్ కబడ్డీ టోర్నమెంట్ అండర్-17 విభాగంలో పాల్గొని ప్రతిభ కనపర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో సంజనను హెచ్‌ఎం రమణయ్య, పీడీలు మస్తానయ్య, హరిబాబు అభినందించారు. పోటీల్లో పాల్గొనడానికి సహాయ సహకారాలు అందించిన మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ నిర్వాహకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు 'పీఎం కిసాన్' ప్రత్యక్ష ప్రసారం

రేణిగుంట జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి వేదికగా రేపు ప్రధానమంత్రి మోదీ పీఎం కిసాన్ 20వ విడత నిధులను రైతుల బ్యాంక్ ఖాతాలోకి జమ చేయనున్న కార్యక్రమాన్ని కరకంబాడిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు రాస్ హెడ్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజనులకు దారి సౌకర్యం కల్పించండి: సీపీఐ



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

సత్యవేడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చమర్తి కండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు అడవిలోకి వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అటవీ సంపదపై ఆధారపడి జీవించే గిరిజనులపై ఇక్కడి క్వారీల యాజమాన్యాల దాష్టీకాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని ఆరోపించారు. గిరిజనులను అడవుల్లోకి వెళ్లనీయకుండా దారికి అడ్డంగా గోతులు తవ్వి వారి జీవనోపాధిపై దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. గిరిజనులు కొండమీదకు వెళ్ళడానికి దారి సౌకర్యం కల్పించాలని, గతంలో గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలు, సాగు భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని సమగ్రంగా సర్వే నిర్వహించి ఆ భూములను వారికి అప్పగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతి పత్రం అందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, మురళి, ధనుంజయులు, గిరిజనులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

సత్యవేడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కులపై ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశులు తెలిపారు. మండలంలోని మదనంబేడు దళితవాడలో గురువారం డివిజనల్ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు ఆధ్వర్యంలో పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పౌరుల హక్కులు, బాధ్యతలు, బాల్యవివాహం, కులవివక్ష తదితర అంశాలపై అవగాహనకల్పించారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

చంద్రబాబుతోనే ఏపీకి మహర్దశ

● ఎమ్మెల్యే భానుప్రకాష్


పుత్తూరు మార్కెట్ యార్డు నూతన కమిటీ చైర్మన్, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే ఏపీకి మహర్దశ చేకూరుతుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం పుత్తూరు మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు రైతులకు సహకారం అందించాలని కోరారు. జిల్లా మార్కెటింగ్ ఏడీ సురేంద్ర ఆధ్వర్యంలో పుత్తూరు మార్కెట్ యార్డు పాలక వర్గం చైర్మన్‌గా డి.ఎస్.గణేష్, వైస్ చైర్మన్‌గా లీలావతి, డైరెక్టర్లుగా బాబునాయుడు, రమేష్, మహేష్, సుజాత, దామోదరం, గోపాల్, అమరనాథ్, ఉమాశంకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్ మాట్లాడుతూ పుత్తూరు మార్కెట్ కమిటీకి కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తి ఉన్నా వచ్చే ఆదాయం జీతభత్యాలకే సరిపోతుందని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని మార్కెట్ కమిటీ స్థలంలో రైతుబజార్లు, వారపు సంతలు, వాణిజ్య సముదాయం ఏర్పాటు చేసి కమిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ గంజి మాధవయ్య, వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగ రెడ్డి, నాయకులు జీవరత్నం నాయుడు, ధనపాల్, బాలాజీ, యుగంధర్, కరుణాకర్, ఆనంద్, ప్రతాప్ రాజు, చెంచయ్య, జానా వెంకటయ్య, ఉమాపతి, హేమాద్రి, దశరథవాసు, కరుణాయాదవ్, మోహన్‌రాజు, తులసి, డీఎన్ ఏలుమలై, భాస్కరరెడ్డి, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు సీఐగా శేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



పుత్తూరు అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సీఐగా కె.ఆర్.శేఖర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా కలికిరి స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న శేఖర్‌రెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేలా, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ రవికుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

కామధేనువుపై ఊరేగిన శ్రీకృష్ణుడు


వాహన సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్, నరసింహ యాదవ్ తదితరులు

పుత్తూరు టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల తిరునాళ్ల సందర్భంగా గురువారం సాయంత్రం కామధేనువు వాహనంపై రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడు ఊరేగారు. ఈ వాహన సేవ పుత్తూరు మండల యాదవ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఎమ్మెల్యే భానుప్రకాష్, నేతలు గంజి మాధవయ్య, పాండురంగ యాదవ్, కరుణా యాదవ్, బొబ్బిలి యాదవ్, వెంకటముని మేస్త్రి, వెంకటరామయ్య, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పుత్తూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): అనుభవం అత్యున్నత విద్యార్హతలు వున్న అధ్యాపకులు, ఆధునిక ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీలతో ఉన్నత శిఖరాలకు వెళ్లేందుకు వసతులు కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ డిగ్రీ కోర్సులలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు వెంటనే ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో తమను సంప్రదించాలని ఆయన కోరారు. అవసరమైతే 94417 75347, 83745 56441లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.


జన్మదిన శుభాకాంక్షలు
ఆరోగ్యశ్రీ సృష్టికర్త, వేలాది మంది కార్మికులకు
ఆదర్శ గృహిణి, పేదలపాటి పెన్నిధి
ఎంతోమందికి రాజకీయ ఓనమాలు నేర్పిన మాజీ మంత్రివర్యులు,
తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో మాజీ సభ్యురాలు
శ్రీమతి గల్లా అరుణమ్మకి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ...
మీరు భవిష్యత్‌లో మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని,
మీరు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని
మనస్ఫూర్తిగా కోరుకుంటూ...
కొమ్మారెడ్డి కిరణ్
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మంగళగిరి